# 15

# క్రీస్తు, సంఘమునకు శిరస్సు

ఓ పిల్లల గుంపు పరుగెత్తుకొంటూ ఒక దుకాణంలోనికి వచ్చినట్టు ఒక పూర్వగాథ చెప్పుతుంది. కొన్ని వస్తువులు కొనుక్కొని వారు త్వరగా వెలుపలికి వెళ్లిపోయారట. కొంతసేపటిలోగా వారు కన్నులకు కనబడలేదు. కొద్ది నిమిషాల తరువాత మరో బాలుడు ఆ దుకాణంలోనికి పరుగెత్తుకొని వచ్చాడు. ఒక పిల్లల "గుంపు యిటువచ్చినట్టు నీవు చుచావా?" అని అతడు ఆ దుకాణపు గుమస్తాను అడిగాడు. "అవును పదిహేను నిమిషాలకు ముందు వారు యిక్కడ ఉన్నారు. వారు చాలా తొందరగా ఉన్నారు" అని ఆ గుమస్తా జవాబిచ్చాడు. "ఏ మార్గాన వారు వెళ్లారు? నేను వారి నాయకుడను!" అని ఆ బాలుడు అన్నాడు.

మనమందరం తరచుగా చూచే నాయకత్వానికి ఈ బాలుడు ఉదాహరణగా ఉన్నాడు – అది ముందుండి నడిపించేది కాదు కాని వెంబడించేవారు ఎటు వెళ్లారోయని వెనుకనుండి ఆశ్చర్యపడే నాయకత్వం! మానవ నాయకత్వానికి ఉండే సమస్య దాని బలహీనత, దాని లోపం. ఏదో ఒక సందర్భంలో మానవ నాయకత్వము నిరాశ కలిగిస్తుంది. ప్రజలు ఎల్లప్పుడు ప్రజలుగా ఉండబోతారు.

కొన్ని సార్లు సంఘం కూడా బలహీనమైన నాయకత్వం కలిగియుంటుందా? పరలోకానికి పయనించే ఓడ బలహీనమైన, లోపముగల నావికుని కలిగియుందా? భూమిమీదనుండి మహా గొప్ప నిత్యమైన తీరానికి చేరవలసిన ఓడలోని జనులు విరిగిపోయిన లేక పగిలిపోయిన దిక్సూచి మీద ఆధారపడవలసిందేనా?

సంఘమునకు శిరస్సు యేసు క్రీస్తు తప్ప మరెవ్వరు కాదు అని ఉద్ఘాటించిన పరిశుద్ధాత్మ యొక్క మాటలు అలాటి భయములన్నిటిని పారద్రోలుతాయి. "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నాడు. క్రీస్తు శరీరమునకు రక్షకుడైయున్నాడు" అని పౌలు వ్రాశాడు (ఎఫెసీ. 5:23-25). ఆయన చేసిన మహా గొప్ప త్యాగమునుబట్టి, క్రీస్తు సంఘాన్ని నడిపించే హక్కుగలవాడై యున్నాడు. "క్రీస్తు సంఘమునకు

శిరస్సైయున్నాడు" అనే ప్రయోగాన్ని లోతుగా నీ మనస్సులోనికి నాటుకొననిమ్ము. క్రీస్తును సంఘానికి శిరస్సుగా చూడడమే క్రీస్తు సభ్యులకు అభయమిస్తుంది, ఎందుకంటే దోషములేని నడిపింపు వారు పొందుతారని అది వారికి గుర్తు చేస్తుంది. క్రైస్తవేతరులు సంఘంలోనికి రావడానికి అది హేతువౌతుంది – లోపంలేని క్రీస్తు యొక్క నాయకత్వం క్రిందికి వచ్చేదానికి ఆధారమౌతుంది. ఏయే విధాలుగా ఆయన సంఘమునకు శిరస్సైయుంటాడో ఆలోచిస్తూ, "క్రీస్తు, సంఘమునకు శిరస్సు" అనే అభయంతో కూడిన అంశాన్ని ఆలోచించుదాం.

## అధికారంలో ఆయన శిరస్సైయున్నాడు

మొదటిగా, అధికారంలో క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నాడు. ఆయన ప్రభువైయున్నాడు, ఆయన తన చట్టముచేత (దాన్ని) నడిపిస్తాడు.

ఆయన మృతులలోనుండి పునరుత్థానుడై, పరలోకమునకు ఆరోహణుడైన పిమ్మట, శక్తికంటెను ప్రభుత్వముకంటెను, ఎంతో హెచ్చుగా పరలోకమందు "దేవుని కుడిపార్శ్వమున ఆసీనుడైయున్నాడు" (ఎఫెసీ. 1:21). దేవుడు, "సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; ..." (ఎఫెసీ. 1:22, 23).

"సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము, ఆయన ఆదియైయుండి మృతులలోనుండి లేచుటలో ఆది సంభూతుడాయెను. ఆయనయందు సర్వసంపూర్ణత నివసింపవలెననియు, ...తండ్రి అభీష్టమాయెను" అని పౌలు కొలస్సీలో అదే సత్యాన్ని వక్కాణించాడు (కొలస్సీ. 1:18–20). హెబ్రీ పత్రిక యొక్క లేఖకుని ప్రకారము, ఈ దినముల అంతమందు, లేక క్రైస్తవ యుగమునందు దేవుడు తన కుమారుని ద్వారా మనతో మాట్లాడుచున్నాడు (హెబ్రీ. 1:1, 2). మరియు, "అందుచేతను పరలోకమందున్నవారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలో గాని, ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసు క్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెను ..." (ఫిలిప్పీ. 2:9–11). కాలాంతమువరకు సంఘమునకు శిరస్సుగా లేక రాజ్యమునకు రాజుగా క్రీస్తు ఏలవలసియున్నట్టు లేఖనాలు మనలను నమ్మిస్తున్నాయి. అప్పుడు ఆయన

సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును (1 కొరింథీ. 15:23, 24).

క్రీస్తు సంఘము ఆయన అధికారములోను, నాయకత్వం క్రిందను ఉంటుంది. "తన్ను" చూపించుకునే ఈ కాలంలోను, క్రీస్తు సంఘంలోని జనులు తమ సొంత మార్గాలు కావాలని కోరుకోలేరు. మొదట "నాది లేక నేను" అని అనలేరు. అదే సమయంలో వారు యేసును ప్రభువుగా గుర్తిస్తారు. ఆయన ఆధిపత్యానికి లోబడేలా నడిపింపబడినవాడై, క్రైస్తవుడు తీసికొనే ప్రతి నిర్ణయము ఆత్మసంబంధమైన నిర్ణయమై యుంటుంది.

## మాదిరిలో ఆయన శిరస్సైయున్నాడు

రెండవది, మాదిరిలో క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నాడు. దేవునికి లోబడుటలో ఆయన పరిపూర్ణమైన నమూనాయైయున్నాడు. ఆయన తన పాపరహితమైన జీవితం ద్వారా నడిపిస్తాడు.

ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్ను తాను అప్పగించుకొనినట్లు పేతురు చెప్పాడు (1 పేతురు 2:22, 23).

తాను చేసిన లేక జరిగించిన పొరపాటునకు క్రీస్తు ఎన్నడు క్షమాపణ చెప్పుకోవలసిన వాడుగా లేడు. తప్పుగా పలికిన మాటను ఆయన వెనుకకు తీసికొనే అవసరత ఆయనకు ఎన్నడూ ఏర్పడలేదు. ఆయన హృదయానికి పాపపు యోచన ఎన్నడూ అంటలేదు. తన శత్రువులు ఆయనను పరీక్షించారుగాని, ఆయనలో ఏ దోషమును వారు కనుగొనలేకపోయారు.

సత్యమైన, పవిత్రమైన, ఖ్యాతిగల – ఆలాటి జీవితాలను జీవించేలా ఆయన మనలను నడిపింపగోరుతున్నాడు (ఫిలిప్పీ. 4:8). యాకోబు యిలా వ్రాశాడు, "... దేవుడు కీడు విషయమై శోధింపబడనేరడు; ఆయన ఎవనిని శోధింపడు గనుక ఎవడైనను శోధింపబడినప్పుడు – నేను దేవునిచేత శోధింపబడుచున్నానని అనకూడదు. ప్రతివాడును తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడును" (యాకోబు 1:13, 14). మనకు విరోధి క్రీస్తు కాదు; కాని "శోధకుడు" అని పిలువబడే అపవాదియే (మత్తయి 4:3). గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునాయని వాడు

తిరుగులాడుతూ ఉంటాడు (1 పేతురు 5:8). మన బలహీనతను వాడు అవకాశంగా తీసికొనజూస్తాడు.

ప్రభువు మన బలహీనతలనెరుగును; మన పోరాటాలను ఆయన అర్థం చేసికొంటాడు. ఆయన కూడా శోధకుని ఎదుర్కోవలసివచ్చింది, అయినా, ఆయన పాపములేని వాడుగా ఉన్నాడు (హెబ్రీ. 4:15). ఆయన మన యెదుట శోధనను నిలుపడు; పైగా, తప్పించుకునే మార్గాన్ని ఆయన ఏర్పాటు చేస్తాడు. మనం సహించగలదానికంటె ఎక్కువగా మనలను శోధింపబడనియ్యడు (1 కొరింథీ. 10:13).

సంఘము యొక్క శిరస్సు అధికారంలో ఎంతటి పరిపూర్ణుడో, తన శీలములో కూడా ఆయన అంత పరిపూర్ణుడైయున్నాడు. ఆయన సంఘము తన అధికారానికి లోబడాలి సరిగదా, అది ఆయన జీవిత విధానాన్ని అనుకరించాలి. 1 యోహాను 2:6 యిలా అంటుంది, "ఆయనయందు నిలిచియున్నవాడనని చెప్పుకొనువాడు ఆయన ఏలాగు నడుచుకొనెనో ఆలాగే తానును నడుచుకొన బద్ధుడైయున్నాడు" క్రీస్తు ప్రభువు సంఘానికి యిచ్చే నాయకత్వం వింతైన లేక ఏకైకమైనదై యున్నందున, "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడని" పౌలు అన్నాడు (1 కొరింథీ. 11:1).

ఒక విధంగా చూస్తే, క్రీస్తు మనకు పరిపూర్ణమైన రక్షకుడైయున్నాడు. దేవుని యెదుట పరిపూర్ణమైన జీవితాన్ని జీవించి, మనకు రక్షకుడైయుండడానికి పరిపూర్ణంగా యోగ్యతపొందినవాడై పాపపరిహారము కొరకై దేవుని యెదుట ఆయన తన పాప రహితమైన జీవితాన్ని అర్పించుకున్నాడు. హెబ్రీ రచయిత యిలా వివరించాడు, "ఆయన, కుమారుడైయుండియు తాను పొందిన శ్రమలవలన విధేయత నేర్చుకొనెను. మరియు ఆయన సంపూర్ణసిద్ధి పొందినవాడై ... తనకు విధేయులైన వారికందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను" (హెబ్రీ. 5:8-10).

మనం దేన్ని తేరిచూస్తామో దానిగా రూపొందుతాము; మనం దేన్ని అభినందిస్తామో దాన్ని మనం అనుకరిస్తామని తెలుపుతూ, "face" అనే ఒక కథను నతానియేల్ హౌతార్న్ వ్రాశాడు. అణగారిన జనులు నివసించే గ్రామానికి ఎదురుగా ఉన్న లోయలో కొండకు ఒక ప్రక్కన దయగల ముఖం చెక్కబడింది. ఆ గొప్ప రాతి ముఖంలాటి ముఖంగల ఒకడు లేచి అణగ ద్రొక్కబడిన ఆ జనులకు విమోచననిస్తాడని ఆ జనులు నమ్మేవారట. ఆ గ్రామంలోని ఒక బాలుడు వాంఛతోను అలా కావాలనే కోర్కెతోను ఆ రాతి ముఖాన్ని చూస్తూ ఉండేవాడట. కాలక్రమంలో, ఆ రాతి ముఖాన్ని చూస్తూ, దాన్ని అభినందించుతునే ఉంటుండగా, ఆ యువకుడు ఆ ముఖంవలెనే

మారిపోయాడట, తమ విమోచకునిగా ఆ సమాజం అతన్ని గుర్తింప నారంభించింది.

మనం దేన్ని చూస్తామో దానిగా మారిపోతామనేది మరి విశేషంగా సంఘం పట్ల నిజమైయుంటుంది. పౌలు యిలా అన్నాడు, "మనమందరమును ముసుగు లేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత (లేక ఆత్మయగు ప్రభువుచేత) ఆ పోలికగానే మార్చబడుచున్నాము" (2 కొరింథీ. 3:18).

ఎలా జీవించాలి అనేదానికి మాదిరిగా క్రీస్తు సంఘము ఆయన జీవితాన్ని చూస్తుంది. మాదిరిలో ఆయన మన శిరస్సు. దాని సభ్యులు ఆయన వైపు చూడడం మాత్రమేగాక, ఆయననే చూస్తారు (హెబ్రీ. 12:2), ఆయన తన పరిపూర్ణమైన జీవితంలో సంఘాన్ని ఎల్లవేళ్లలా నడిపిస్తాడు.

## ప్రేమలో ఆయన శిరస్సైయున్నాడు

మూడవది, ప్రేమయందు క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నాడు. అద్భుతమైన తన ప్రేమతో ఆయన తన ప్రజలను నడిపించుచుతూ ఆజ్ఞాపిస్తున్నాడు.

తన మరణానికి ముందు సహితము, ప్రభువు తన శిష్యులకు యిలా తెలియజేశాడు, "మీరు ఒకరి నొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరి నొకరు ప్రేమింపవలెను. మీరు ఒకనియెడల ఒకడు ప్రేమగలవారైనయెడల దీనిబట్టి మీరు నా శిష్యులని అందరును తెలిసికొందురు" (యోహాను 13:34, 35 ఒత్తి పలికింది నాది). ఆయన వారికి యింకా యిలాగున తెలిపాడు, **"నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము**, మీరొకని నొకడు ప్రేమించవలె ననుటయే నా ఆజ్ఞ" (యోహాను 15:12; ఒత్తిపలికింది నాది).

తన ప్రజలకొరకు క్రీస్తు కనుపరచిన ప్రేమ తన అనుచరులను మూడు విధాలుగా నడిపిస్తుంది. మొదటిది, అది ఆయనను ప్రేమించేలా చేస్తుంది. ఆయన యిలా అన్నాడు, "ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము" (1 యోహాను 4:19). రెండవది, ఆయన ప్రేమ క్రైస్తవులు ఒకరినొకరు ప్రేమించుకునేలా చేస్తుంది. యోహాను యిలా అన్నాడు, "ఆయన మన నిమిత్తము తన ప్రాణముపెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము. మనముకూడా సహోదరుల నిమిత్తము మన ప్రాణములను పెట్ట బద్ధులమై యున్నాము" (1 యోహాను 3:16). మూడవది, తన ప్రేమ తన్ను వెంబడించే వారిని తన చిత్తము జరిగించే వారిలా

చేస్తుంది. ప్రభువు యిలా అన్నాడు, "మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలు గైకొందురు" (యోహాను 14:15).

క్రీస్తు యొక్క భూనివాస కాలపు పరిచర్యను దేవదూతలు తిలకించుచుండగా, వారు భక్తితో కూడిన భయము కలిగియుండేవారే. ఆయన సిలువ మరణానికి ముందు, ఒక పళ్లెమునిండ నీళ్లను, ఒక తువ్వాలును తీసికొని, ప్రేమతోను అణకువతోను తన శిష్యుల పాదాలను కడిగాడు! రాజులకు రాజే తన శిష్యుల యెదుట ప్రేమతోకూడిన సేవతో మోకాలు వంచాడు. క్రీస్తు కేవలం నరరూపు దాల్చడం మాత్రమే గాక, ఆయన నరులకు దాసుడుగా మారాడు. ఆయన మనుష్య పోలికగా పుట్టి దాసుని స్వరూపాన్ని ధరించుకున్నాడు (ఫిలిప్పీ. 2:7).

ఈ ప్రాముఖ్యమైన దృశ్యాన్ని యోహాను ఈ మాటలలో పరిచయం చేశాడు: "తండ్రి తనచేతికి సమస్తము అప్పగించెననియు, తాను దేవుని యొద్దనుండి బయలుదేరి వచ్చెననియు, దేవునియొద్దకు వెళ్లవలసి యున్నదనియు యేసు ఎరిగి" (యోహాను 13:3). మరోవిధంగా చెప్పాలంటే, ప్రత్యేకంగా, తన యొక్క అధికారము, అంతస్థు, మరియు భవిష్యత్తులను గూర్చిన విషయాలు గుర్తెరిగియుండి కూడా, దాసుడుగా జీవించిన తన జీవితానికి అనుగుణ్యంగా ఉండునట్లు ఆయన తన్ను తానే రిక్తునిగా చేసికొనెను (తన్ను తాను తగ్గించుకొనెను). తన ఆధిక్యత, బలములను, తన అధికారము, అంతస్థులను ఆయన ప్రదర్శించుకొనలేదు. ప్రేమయందు, అణకువను గూర్చిన పాఠాన్ని ఆయన తన శిష్యులకు నేర్పించడానికి దీనిని ఉపయోగించుకున్నాడు.

సంఘమునకు శిరస్సుగా, తన శక్తితోను అధికారంతోను ఆయన ప్రేమ పూర్వకంగా సేవ చేస్తాడు! తన శిష్యుల యొక్క పాదములను కడిగిన సమయంలో ప్రభువుగా ఉన్న తన హోదాను ఆయన వదలుకోలేదు; ప్రభువుగా ఉన్న తన అంతస్థును వారికి సేవ చేయడానికి ఉపయోగించుకొని, సేవ చేసే తత్వాన్ని ఆయన వారి అంతరంగమందు కట్టనుద్దేశించాడు. ఆయన వారితో యిలా అన్నాడు, "బోధకుడనియు ప్రభువనియు మీరు నన్ను పిలుచుచున్నారు; నేను బోధకుడను ప్రభువును గనుక మీరిట్లు పిలుచుట న్యాయమే. కాబట్టి ప్రభువును బోధకుడనైన నేను మీ పాదములు కడిగిన యెడల మీరును ఒకరి పాదములు ఒకరు కడుగవలసినదే. నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని" (యోహాను 13:13-15).

ఇంతకు ప్రేమ అంటే ఏమో, నిజమైన ప్రేమ ఎలా ప్రత్యక్షపరచబడుతుందో మహా ఘనమైన రూపంలో ప్రభువు చిత్రించాడు. క్రీస్తు తన సంఘాన్ని తన ప్రేమతో నడిపిస్తాడు. తన ప్రేమయొక్క వాతావరణంలో క్రైస్తవులు జీవించుతూ, ఆ వాతావరణాన్ని

ఆశ్వాదించుతూ (పీల్చుకొంటూ), దానికి లోబడుతూ ఉండగా, ఆయన సారూప్యంలోనికి వారు తిరిగి రూపించబడతారు. యోహాను యిలా అన్నందుకు ఆశ్చర్యపడనక్కరలేదు, "ప్రియులారా, మనము ఒకనినొకడు ప్రేమింతము; ఏలయనగా ప్రేమ దేవుని మూలముగా కలుగుచున్నది; ప్రేమించు ప్రతివాడును దేవుని మూలముగా పుట్టినవాడై దేవుని ఎరుగును. దేవుడు ప్రేమాస్వరూపి; ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు" (1 యోహాను 4:7, 8).

## ముగింపు

నిశ్చయముగా, అధికారంలోను, మాదిరిలోను, ప్రేమలోను, సేవ చేయుటలోను క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నాడు. ఆయన తన సంఘాన్ని తన ఆధిపత్యం ద్వారాను, పరిపూర్ణమైన ఏ సంస్థయొక్క నాయకుడైనా, లేక ఏ గుంపుయొక్క యజమానియైనా, నమ్మకత్వము, ఆధిపత్యము, తనకు కలిగియున్న బలము తాను నడిపించే ఆ సంస్థకు ఆ జనానికి యివ్వాలి. ఇది క్రీస్తు, ఆయన సంఘం విషయంలో తప్పక నిజమైయుంది. దేవుని కుమారుడైన క్రీస్తు, తన మచ్చలేని పరిపూర్ణతను, అనంతమైన జ్ఞానమును, సాటిలేని న్యాయబుద్ధిని, సర్వశక్తితోకూడిన బలమును ఆయన ఆధిపత్యంతోను నాయకత్వంతోను తన సంఘానికి ప్రసాదిస్తున్నాడు.

క్రీస్తు సంఘము క్రీస్తుచేత స్థాపించబడింది, క్రీస్తుచే నడిపింపబడుతుంది, క్రీస్తు యొక్క నామాన్ని అది ధరించుకొంటుంది. తనకు కలిగియున్నదంతా క్రీస్తు తన సంఘానికి యిస్తాడు; క్రీస్తుకు ఉన్న భవిష్యత్ ఏదైనా, అది సంఘానికి కూడా ఉంటుంది. నేడు ఆయన తన సంఘాన్ని భరించడానికిని, భవిష్యత్తులో దాన్ని పవిత్రపరచడానికిని ఆయన వాగ్దానం చేశాడు. "అది కళంకమైనను ముడుతయైనను అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదకస్నానముచేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (ఎఫెసీ. 5:27).

క్రీస్తు సంఘమును సృజించి, తన ప్రేమను, తన రక్షణను దానికి ప్రసాదించి, నిత్యమహిమ అనే తన వాగ్దానంతో ఆయన దానికి కిరీటం ధరింపజేసినట్లయితే, ఆయన సంఘములో ఉండకోరనివాడెవడు?

క్రీస్తుచే నడిపింపబడే సంఘములో నీవు భాగస్వామివైయున్నావా?

## పరిశీలనకైన ప్రశ్నలు

(*జవాబులు - 257వ పేజీలో*)

1. నిజంగా నడిపించని నాయకత్వం యొక్క ఉదాహరణలిమ్ము?
2. అధికారంలో క్రీస్తు సంఘానికి ఎలా శిరస్సైయున్నాడు? ప్రభువైన యేసుకు సర్వాధికారమున్నదని బోధించే లేఖన భాగాలనిమ్ము.
3. సంఘమునకు శిరస్సుగా క్రీస్తు ఎంతవరకు పరిపాలన చేయాలి? (1 కొరింథీ. 15:23-25 చూడు).
4. మన పరిపూర్ణ రక్షకుడుగా ప్రభువు ఎలా రూపొందాడు? (హెబ్రీ. 5:8, 9 చూడు).
5. క్రీస్తులోనికి మార్పు చెందడం కాలంలోని ఒక సంభవం, కాని తన స్వరూపం లోనికి మార్చబడడం అనేది కాలక్రమంలో జరిగే విధానమైయుంది. రూపాంతరంపొందే విధానాన్ని చర్చించు (2 కొరింథీ. 3:18 చూడు).
6. క్రీస్తు కొరకు అనుదినం జీవించడంలో క్రీస్తు తన శిష్యుల పాదాలను కడిగినది మనకేమి బోధిస్తుంది?
7. క్రైస్తవులు నేడు ఒకరి పాదములు ఒకరు ఎలా కడుగుకుంటారు?